క్లుప్తంగా

ఈ-పంట నమోదుతో రైతులకు మేలు

గుడ్లవల్లేరు: ఈ-పంట నమోదు చేయటం వలన రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని ఏఓ సునీల్ అన్నారు. కొతవరంలో ఈ-పంట నమోదు కార్యక్రమాన్ని బుధవారం ఏఓ పరిశీలించారు. ప్రతి రైతు ఖరీఫ్ - 2024 కాలంలో సాగు పంట పూర్తి వివరాలతో పాటు పంట రకాన్ని తమ దగ్గరలో ఉన్న రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

ఘనంగా కళాశాల విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలు



పామర్రు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో బుధవారం ఫ్రెషర్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ అరుణప్రభ మాట్లాడుతూ విద్యార్థులందరూ కష్టపడి చదివి, క్రమశిక్షణతో ఉండాలన్నారు. అప్పుడే జీవితంలో ఎన్నో విజయాలను సాధించవచ్చన్నారు.

ఎరువుల వినియోగంపై జాగ్రత్తలు తప్పనిసరి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ రమాదేవి



సింగరాయపాలెంలో పొలంబడి కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయాధికారులు

గుడివాడరూరల్: పంట పొలాలకు ఎరువులను వినియోగించే విషయంలో రైతులు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయశాఖ ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి అన్నారు. మండలంలోని చౌటపల్లి గ్రామంలోని రైతు అట్లూరి రమణప్రసాద్ పొలంలో బుధవారం పొలంబడి కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ అధికారులు నిర్వహించారు. రైతులకు పొలంలోనే ఎరువుల వినియోగం, మిగిలిన అంశాలపై శిక్షణ ఇచ్చారు. గత వారం నాట్లు వేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విధానాలకు సంబంధించి ఇచ్చిన శిక్షణపై రైతులతో చర్చించారు. అనంతరం ఏడీఏ మాట్లాడుతూ మండలంలో అధికంగా ఎంటీయూ 1318 రకం వరి విత్తనాలను సాగు చేసినట్లు తెలిపారు. ఈ రకానికి సంబంధించి పంట పొలాలకు తగు మోతాదులోని యూరియాను పిచికారీ చేయాలని సూచించారు. మండల వ్యవసాయశాఖ అధికారి బోలెం అనంతలక్ష్మి పాల్గొన్నారు.

మిత్ర పురుగులను కాపాడుకోవాలి

ముదినేపల్లి రూరల్: పంటలకు మేలు చేకూర్చే మిత్ర పురుగులను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని మండవల్లి సబ్ డివిజన్ ఏడీఏ జి.వెంకట మణి అన్నారు. మండలంలోని సింగరాయపాలెంలో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్ర స్థాయిలో పర్యటించి నాట్లు వేస్తున్న పొలాలను పరిశీలించారు. రైతులతో సమావేశం నిర్వహించి సార్వా సీజన్‌లో వరి సాగులో పాటించాల్సిన సూత్రాలను వివరించారు. మిత్ర పురుగుల వలన పైరుకు సోకే శత్రు పురుగులను సులభంగా నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఓ బి.వేణుమాధవ్, సింగరాయపాలెం, శ్రీహరిపురం వ్యవసాయ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉషోదయ సూపర్ మార్కెట్ ప్రారంభం

గుడివాడ టౌన్: గుడివాడలో అధునాతన విధానాల్లో వ్యాపారాలు ఏర్పాటు చేయడం అభినందనీయం అని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. స్థానిక ఏలూరు రోడ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఉషోదయ సూపర్ మార్కెట్‌ను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఈ విధమైన వ్యాపారాలకే ఆదరణ లభిస్తుందన్నారు. అన్ని రకాల వస్తువులను అందరికీ అందుబాటులో ఉండే ధరల్లో ఇక్కడ లభించడం విశేషమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ గద్దె అనురాధ, రాజ్యసభ మాజీ సభ్యుడు కె.రవీంద్రకుమార్, మాజీ ఎమ్మెల్సీ విఠల్ రావు, ఉషోదయ సూపర్ మార్కెట్ యజమాని యుగంధర్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



ఉషోదయ సూపర్ మార్కెట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాము తదితరులు

200 అడుగుల జాతీయ జెండాతో భారీ ర్యాలీ



గుడివాడలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

గుడివాడ టౌన్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో 200 అడుగుల జాతీయ జెండాతో విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ర్యాలీని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రారంభించారు. టీడీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ

కైకలూరు: పంద్రాగస్టు సందర్భంగా వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత ప్రారంభించారు. ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ఎం.విజయకుమార్, యూత్ రెడ్ క్రాస్ కో-ఆర్డినేటర్ ఎం.హరిప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్ శివనాగరాజు పాల్గొన్నారు.



కైకలూరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ

స్వాతంత్ర్య సమరయోధుల స్థూపం ముస్తాబు

మండవల్లి: మండవల్లి సెంటర్‌లో దేశం కోసం అసువులు బాసిన స్వాతంత్ర్య సమరయోధుల స్థూపం వద్ద సర్పంచ్ మెండా ఝాన్సీ బుధవారం పరిసరాలను శుభ్రం చేయించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మెండా సురేష్ పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి

ముదినేపల్లి రూరల్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతీ ఇంటిపై మువ్వన్నెల పతాకం ఎగురవేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట ప్రోలు కృష్ణ పిలుపునిచ్చారు. ముదినేపల్లిలో బుధవారం మాట్లాడుతూ పార్టీ ఆధ్వర్యంలో గ్రామాల్లో ఇప్పటికే జాతీయ జెండాలను పంపిణీ చేశామన్నారు.

● విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



గుడివాడ టౌన్: స్థానిక కాపు సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. సేవా సమితి అధ్యక్షుడు నరహరిశెట్టి ప్రసాదు ఆధ్వర్యంలో 60 మందికి కిట్లను పంపిణీ చేశారు. పాఠశాల హెచ్‌ఎం రమేష్, కాపు సేవా సమితి కార్యదర్శి మల్లేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఎం.సత్యనారాయణ, అద్దేపల్లి పురుషోత్తం, బి. నోబుల్ నాయుడు, జాయింట్ సెక్రటరీ నాగేశ్వరరావు, వీరశేఖర్, సాయిదీప్ తదితరులు పాల్గొన్నారు.

● గుడివాడ అభివృద్ధికి ఎమ్మెల్యే రాము కృషి



గుడివాడరూరల్: గుడివాడ నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము చేస్తున్న కృషి ప్రశంసనీయమని కూటమి ఎమ్మెల్యేలు గద్దే రామ్మోహన్, కామినేని శ్రీనివాస్ అన్నారు. ఏలూరురోడ్డులో టీడీపీ ప్రజావేదికలో ఎమ్మెల్యే రాము ఇచ్చిన తేనేటి విందులో ఇరువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. రాజ్యసభ మాజీ సభ్యుడు కనకమేడల రవీంద్ర బాబు, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్, మాజీ జెడ్పీ చైర్మన్ గద్దే అనురాధ తదితరులు పాల్గొన్నారు.

● ఎంటీఎస్ ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలి

ముదినేపల్లి రూరల్: పని సర్దుబాటు నుంచి తమకు మినహాయింపు ఇవ్వాలని మండలంలోని ఎంటీఎస్ (మినిమం టైం స్కేల్) ఉపాధ్యాయులు కోరుతున్నారు. ఈ మేరకు మండల విద్యాశాఖాధికారికి బుధవారం వినతి పత్రం ఇచ్చారు. లాంటి ఉపాధ్యాయుల వయస్సు 50 సంవత్సరాలు పైబడి ఉండడంతో వీరికి సర్దుబాటులో మినహాయింపు ఇవ్వాలని కోరారు.

● నేడు గాంధీ ఆశ్రమంలో జెండా ఆవిష్కరణ

మండవల్లి: స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా గురువారం జాతీయ జెండా ఆవిష్కరణ జరుగుతుందని కార్య నిర్వహణాధికారి దివ్యశ్రీ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనంతరం మహాత్ముడి విగ్రహానికి ఘనంగా నివాళులర్పించనున్నట్లు తెలిపారు.

● స్వాతంత్ర్య వేడుకలకు అందరూ హాజరు కావాలి

గుడివాడరూరల్: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను గుడివాడ మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం ఉదయం ఎనిమిది గంటలకు ఎంపీపీ గద్దె పుష్పరాణి అధ్యక్షతన నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ త్రినాథ్ తిరుమలరావు కోరారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, స్వాతంత్ర్య సమరయోధులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

● పమిడిముక్కల ఎంపీడీఓగా విఠల్‌పాల్

పమిడిముక్కల: పమిడిముక్కల ఎంపీడీఓగా సీహెచ్ విఠల్‌పాల్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన షేక్ మహబూబ్ సుభానీ బదిలీపై గుంటూరు జిల్లాకు వెళ్లారు.

● మొవ్వ ఎంపీడీఓగా సుధాప్రవీణ్

మొవ్వ: మొవ్వ ఎంపీడీఓగా జి.సుధాప్రవీణ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం ఎంపీడీఓగా బదిలీ అయిన ఆయన ఎన్నికల అనంత రం జరిగిన బదిలీల్లో మొవ్వ మండలానికి తిరిగి వచ్చారు. ఈయన్ను ఈఓపీఆర్‌డీ వీర్ల సీతారామరాజు, సీనియర్ అసిస్టెంట్ చింతా శ్రీనివాసరాజు, జేఏ చింతా రామ్మూర్తి అభినందించారు.

● తోట్లవల్లూరు ఎంపీడీఓగా స్వర్ణలత

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు ఎంపీడీఓగా టి.స్వర్ణలత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన స్వర్ణలతకు కార్యాలయ ఏఓ ఉషారాణి, కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు ఆత్మీయ స్వాగతం పలికారు.

● పాస్టర్లకు బహుమతుల పంపిణీ



పామర్రు: స్థానిక బందరు రోడ్డు అరండాల్ పేటలోని కృపా మిషన్ చర్చిలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పాస్టర్లకు బహుమతులను ఏపీ క్రైస్తవ సంక్షేమ సంఘ అధ్యక్షుడు సాల్మన్ కొల్లాబత్తుల ఆధ్వర్యంలో బుధవారం అందజేశారు. సంఘ కార్యదర్శి జాన్ మోజస్ 20 మంది సేవకులు, మహిళలకు బహుమతులను అందజేశారు. పాస్టర్లు గాబ్రియేల్, విలియం కేరి, ఆనంద్‌రావు, శామ్యుల్, దేవసహాయం, ఏసురత్నం పాల్గొన్నారు.

● రేపు సామూహిక కుంకుమార్చనలు

గుడివాడ టౌన్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందు ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 16న సామూహిక లక్ష్మీదేవి కుంకుమ పూజలు ఏర్పాటు చేసినట్లు టీటీడీ విశిష్ట ధర్మాచార్య కావూరి శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక కోతిబొమ్మ సెంటర్‌లోని శ్రీరామ సహిత సత్యనారాయణ స్వామి దేవస్థానంలో సాయంత్రం ఐదు గంటలకు ఈ పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 99083 66811లో సంప్రదించాలని కోరారు.

● ఎరువులు అందుబాటులోకి తీసుకురావాలి

మొవ్వ: ఎరువులు, పురుగు మందులు అందుబాటులోకి తీసుకొచ్చి రైతులను ఆదుకోవాలని కౌలు రైతు సంఘం సహాయ కార్యదర్శి శీలం నారాయణ రావు కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మొవ్వ మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో వరినాట్లు పూర్తి కావచ్చాయని పేర్కొన్నారు. ఈ తరుణంలో ఎరువుల అవసరం ఉందని ఇప్పటికే సంబంధిత అధికారులకు, మంత్రులను కౌలు రైతు సంఘం కోరినట్లు తెలిపారు.

● క్లబ్ నూతన కార్యవర్గం ఎంపిక

గుడివాడ టౌన్: ది గుడివాడ ఆఫీసర్స్ క్లబ్ నూతన కార్యవర్గ ఎంపిక బుధవారం ఏకగ్రీవంగా జరిగింది. ఎన్నికల అధికారిగా వ్యవహరించిన పొట్లూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ క్లబ్ అధ్యక్షుడిగా పొట్లూరి వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా నిమ్మగడ్డ శివశంకర్, జాయింట్ సెక్రటరీగా విస్సంశెట్టి కృష్ణకిషోర్, కోశాధికారిగా మాగంటి శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. వీరితో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

● మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి



తోట్లవల్లూరు: ప్రభుత్వాస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి జి.గీతాబాయి ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆమె తనిఖీ చేశారు. వార్డులో ఉన్న బాలింత చాగంటిపాటి భవ్యలక్ష్మిని ఆమె పరామర్శించారు. కాన్పు జరిగిన తీరుపై ఆరా తీశారు. మొదటి కాన్పును సాధారణ ప్రసవం చేసిన ఆస్పత్రి సిబ్బందిని ఆమె అభినందించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాయిప్రసన్న పాల్గొన్నారు.

గుడ్లవల్లేరులో నషా ముక్త్ భారత్ అభియాన్

గుడ్లవల్లేరు: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీలో మత్తు పదార్థాల నిర్మూలనకు నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ముందుగా విద్యార్థులు మానవ హారంగా ఏర్పడి డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు ప్రతిజ్ఞ చేశారు. ఆంధ్ర బెటాలియన్ యూనిట్ మచిలీపట్నం ఎన్‌సీసీ పీఐ రాజ్‌సింగ్, ప్రవీణ్‌కుమార్ మొక్కలు నాటి తమ దేశభక్తిని చాటారు. కళాశాల సలహాదారు డాక్టర్ పి.రవీంద్ర బాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.కరుణకుమార్ పాల్గొన్నారు. అలాగే గుడ్లవల్లేరులో నిర్వహించిన తిరంగ ర్యాలీలో ఎంపీడీఓ డి.కృష్ణవేణి, ఈఓపీఆర్డీ వి.దిలీప్‌కుమార్, కార్యదర్శి నరసింహారావు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి చర్యలు

పామర్రు: ఆలయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని దేవదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎస్.సంధ్య పేర్కొన్నారు. స్థానిక వేణుగోపాలస్వామి ఆలయాన్ని అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆలయ పునర్నిర్మాణాన్ని రూ.72 లక్షలతో పూర్తి చేసినట్లు తెలిపారు. తొలుత ఆలయ అర్చకులు ఏసీకి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయ మేనేజర్ కె.వెంకటరెడ్డి ఏసీకి స్వామివారి, అమ్మవారి దీక్షా వస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, మంటాడ వెంకటేశ్వరస్వామి ఆలయ ఈఓ మాధవి లత, జుఝవరం ఆలయ మేనేజర్ దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

క్యాంపస్ సెలక్షన్‌లో 14 మంది ఎంపిక

గుడివాడ టౌన్: స్థానిక వీకేఆర్, వీఎన్‌బీ అండ్ ఏజీకే ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం జరిగిన క్యాంపస్ సెలక్షన్‌లో 14 మందికి ఉద్యోగ అవకాశాలు లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌హెచ్‌వీ ప్రసాదరావు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన జితార టెక్నాలజీస్ సంస్థ ఆధ్వర్యంలో సంస్థ ప్రతినిధి కాలేబు నిర్వహించిన రాత పరీక్షలో 180 మంది విద్యార్థులు పాల్గొన్నారని అనంతరం జరిగిన ఇంటర్వ్యూలో 14 మంది ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఎంపికైన వారికి ఏడాదికి రూ. 5 లక్షలు వేతనం లభిస్తుందన్నారు. ఉద్యోగ అవకాశం పొందిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ వేములపల్లి కోదండరామయ్య, డైరెక్టర్ కల్యాణ్‌కుమార్ అభినందించారు.

సీఎం రాక సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు

గుడివాడరూరల్: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవానికి గురువారం గుడివాడ వస్తున్నందున పట్టణ పరిసర ప్రాంతాల్లో లారీల రాకపోకలకు ఆంక్షలు విధించినట్లు గుడివాడ డీఎస్పీ పి.శ్రీకాంత్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సీఎం పర్యటన సందర్భంగా గురువారం ఉదయం ఐదు గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు పట్టణంలోకి లారీల రాకపోకలను నిషేధించినట్లు పేర్కొన్నారు. లారీలను పామర్రురోడ్డులోని పెదకాల్వ నుంచి గుడ్లవల్లేరు, ముదినేపల్లి, కైకలూరు నుంచి ఏలూరు వైపునకు వెళ్లి హనుమాన్‌జంక్షన్ టూ ఏలూరు హైవేకి చేరుకునే విధంగా చూడాలని కోరారు. ఈ విషయమై లారీల యజమానులకు, సంఘాల సభ్యులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు.

పంటకోత ప్రయోగాలపై శిక్షణ

పమిడిముక్కల: ఈ-పంట నమోదును త్వరితగతిన పూర్తి చేయాలని ఏఓ గణేష్‌రెడ్డి వీఏఏ, వీఆర్వోలకు సూచించారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో బుధవారం గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారులకు ఈ-పంట నమోదు, ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన, పంటకోత ప్రయోగాలపై శిక్షణ ఇచ్చారు. పంటకోత ప్రయోగాలకు రైతు పొలాలను ఏ విధంగా ఎంపిక చేసుకోవాలో ఏఎస్ఓ దీపిక వివరించారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి నాగదేవిశ్రీ, రీసర్వే డీటీ ఏసుపాదం పాల్గొన్నారు.

చెత్త గ్రామంగా లింగవరం



గుడివాడరూరల్: మండలంలోని లింగవరంలో పారిశుద్ధ్యం పడకేసి వీధులు చెత్త కూపాలుగా మారినా పంచాయతీ కార్యదర్శి పట్టించుకోవడం లేదని గ్రామానికి చెందిన యువత బుధవారం గుడివాడలోని మండల పరిషత్ కార్యాలయం వరకు నడుచుకుని వచ్చి అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో కొన్ని సంవత్సరాలు పారిశుద్ధ్య పనులు జరగడం లేదన్నారు. గ్రామంలోని సైడ్ డ్రెయిన్లు పూడిపోయి వర్షాలకు రోడ్లపై మురుగునీరు చేరి వీధులు మురికి కూపాలుగా మారాయన్నారు. దోమలు, క్రిమికీటకాల నివారణకు బ్లీచింగ్, ఫాగింగ్, క్రిమి సంహారక మందులను పిచికారీ చేయాల్సి ఉండగా గ్రామ కార్యదర్శి అటువంటి పనులు నిర్వహించడం లేదని ఫిర్యాదు చేసేందుకు వెళ్లినా అందుబాటులో ఉండటం లేదని పేర్కొన్నారు. పారిశుద్ధ్య పనులు తక్షణమే చేపట్టకపోతే కార్యదర్శిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఫిర్యాదు చేసిన వారిలో గ్రామస్తులు హేమశ్రీ, పి.సాయి, సీతాదేవి, ధనలక్ష్మి, రాంకీ, భార్గవ్ ఉన్నారు.